'మీరు నన్ను చంపండి, కొల్చండి—ఒక్క ఆఖరు మనవి-ఒకటో తారీకు సశాస్త్రీయంగా రేపే. అది అలా అయితే మనకు వచ్చిన నష్ట మేమిటో కాస్త...'

'ఇంకా మెల్లిగా అడుగుతున్నావా? ట్రెజరీ ఖాళీగావుంది. ఇరవై నాలుగ్గంటలలోగా డబ్బువచ్చే సూచనలులేవు. రేపు ఒకటో తారీకైతే మనం అందరికీ జీతా లెలా యిస్తామోయ్ వెర్రివాడా!'

# రాజుగారి కనీసపు కోర్కెలు

'రేపయ్యా!

'సుప్రభాతం ప్రభూ!'

'చూశావా... పేపర్లో...'

'ఏమిటండీ—?'

'మెడ్రాసులో పాకీవాళ్ళు సమ్మె కట్టారుట—?'

'కావచ్చునండి.'

'పాకీవాళ్ళు!'

'చిత్తం—'

'వాళ్ల హక్కులను వాళ్ళు సంరక్షించుకుందుకు!'

'చిత్తం—'

'డాక్టర్లూ, ప్లీడర్లూ, రాజకీయవేత్తలూ, జర్నలిస్టులూ చేయలేని పనిని—'

'చిత్తం—'

'ఈ పాకీవాళ్ళు చేశారు!'

'చిత్తం! చేశారండి—'

'మన రాజ్యంలో ఎప్పుడైనా ఎవరైనా సమ్మె కట్టారా?'

'లేదండి. ప్రభువుల హయాంలో అటువంటి...'

'ఎవళ్ళూ, ఎప్పుడూ సమ్మె చేయలేదూ మన సంస్థానంలో?'

'లేదండి. ఇక్కడ ఎవరూ సమ్మె కట్టవలసిన అవసరంలేదు. ప్రభువుల పరిపాలనలో అలాంటి పని--'

'శేషయ్యా!'

'అయ్యా!'

'ఎంత అప్రదిష్టోయి మనకి!'

'హే ప్రభూ! మళ్ళీ మీ తలకాయలో ఏదో మెదలడం ప్రారంభించింది'

'శేషయ్యా! మన సంస్థానంలో ఇంతమట్టుకు ఒక్క సమ్మెకూడా జరగలేదని చెబుతున్నావు—'

'నిజమేనండి. జరగలేదు—'

'ఎంతగా వెనకబడివున్నామోయి మనం...'

'ఏమీ వెనకబడిలేమండి—'

'శేషయ్యా! చచ్చుమాట! చచ్చుమాట ఆడేవోయి—నీ మొహం నాకు కనబడకండా దాచుకో—'

'ప్రభువుల కింత ఆగ్రహం—'

'శేషయ్యా! ఎందుకు జరగలేదోయి మన సంస్థానంలో సమ్మెలూ?'

'చిత్తం! ఇక్కడ కార్మిక కర్షకులంతా తృప్తిగా వున్నారండి—వారికి యజమానులతో ఏ విధమైన తగాయిదాలూ లేవండి—'

'శేషయ్యా! నాకు ఏడుపొస్తూంది. ఈ పరిస్థితి తలుచుకుంటూంటే—ఏ వొక్క ఆడదన్నా తన భర్తమీదైనా సమ్మె చెయ్యలేదూ?'

'చెయ్యవలసిన అవసరం లేకపోయిందండి—మన సంస్థానంలో, తమ పరిపాలనలో'

'ఛండాలం! ప్రపంచమంతటా జోరుగా సమ్మెలు జరుగుతూంటే—కార్మిక కర్షకులూ, కార్మిక నాయకులూ చెయ్యీ చెయ్యీ కలుపుకుని అభ్యుదయకరంగా ముందుకు సాగుతూంటే, ఫలానా వూళ్ళో ఫలానా ఫలానా సంఘాలు సమ్మెచేసినాయి అని పెద్దక్షరాలతో పేపర్లలో వేయించుకుంటూంటే—మనం—ఇలా— శేషయ్యా! భరించలేను—ఇంక భరించలేను—'

'ప్రభూ !'

'శేషయ్యా! ఇంతటినుంచి మన సంస్థానం అన్ని విధాలా అభ్యుదయకరంగా వుండాలి—ఒక్క సమ్మెనా మన సంస్థానంలో ఇంతవరకు జరగలేదంటే నాకు చాలా చిన్నతనంగా వుంది—'

'జ్ఞప్తి కొచ్చిందండి—మూడేళ్లనాడు మన సంస్థానంలో ఒక బ్రహ్మాండమైన సమ్మె జరిగింది—'

'జరిగిందా! నా శేషయ్యా! నిజంగా జరిగిందా ?'

'జరిగిందండి! ఇక్కడికి ఆరుమైళ్ళ దూరంలో ఒక వూరు తగలపడుతూంటే మన ఫైర్ ఇంజనుకు కబురు వచ్చిందండి—'

'ఊ! ఆ తర్వాత ?'

'ఫైర్ ఇంజన్ ఆ పళాన సమ్మెకట్టి షెడ్‌లోంచి యివతలకు ఊడిపడలేదండి—'

'ఊ ! ఊ !'

'ఆ తర్వాత దాని కనీసపుకోర్కె లేవో అడిగి తెలుసుకుని, దానిలోని భాగాలకు ఇంత చమురుపోసి తలంటించామండి—'

'ఊ ! ఊ !—'

'అప్పుడది సమ్మెచేయడం మాని మంట లార్పడానికి బయల్దేరిందండి—ఆర్నెల్లకు !'

'శేషయ్యా ! మన పరువు కొస్త నిలబడిందనే చెప్పొచ్చును—కాని, ఇదేమంత పెద్ద సమ్మె ?'

'పెద్దదో చిన్నదో—ఏదో జరిగిందండి—దేశంలోని అనేక పత్రికలలో ఈ వార్త పడింది—'

'శేషయ్యా ! నువు చెప్పింది నిజమే కావచ్చు. కాని, అది మూడేళ్ళ నాటి మాట—మన సంస్థానంలో ఇప్పుడు ఆధునికంగా సమ్మెలు జరగాలి—'

'ఎవరు చేస్తారండిప్పుడు ? అంతా సుఖంగా వున్నారు—'

'శేషయ్యా ! ఎవరో వొకరు చేసి తీరాలి—ఆ వార్త పేపర్లలో వేయించాలి—ఆలోచించు—'

'చిత్తం! ఎవర్ని చేయమంటే ఎవరు చేస్తారండీ—ఎవరూ అందుకు వప్పుకోరండి-—'

'శేషయ్యా! ఎవరూ సమ్మె చేయడానికి వప్పుకోరా?'

'వప్పుకోరండి!'

'ఎవరిచేతా—ఒక్క పిట్టచేత కూడా సమ్మె చేయించే శక్తి నీకు లేదా—'

'లేదండి—లాభంలేదు—ఎవరూ తీరి కూర్చుని సమ్మె చేయరండి—'

'శేషయ్యా! చూడూ—అయితే—'

'ప్రభూ! ఏమిటలా లేస్తున్నారూ?'

'శేషయ్యా! ఈ నిముషం నించి నేను—అనగా మా రాజుని—సమ్మె కడుతున్నాను. ఇంతటినుంచి ఈ వెధవ సంస్థానాన్ని నేను పాలించను! ఛో!'

## తాజమహాలు

'శేషయ్యా? వెధవ నిద్ర తొమ్మిదైనా కానీ...నిన్నే! ఈవేళ మనం మన సంస్థానానికి తిరిగి వెడుతున్నాం—మరచిపోయావా?'

'హు! అబ్బా! ఇవాళటికి మానేద్దామండీ ప్రయాణం—బద్ధకంగా వుంది—'

'తాజమహాల్ హోటల్ నీళ్లు బాగా వంటబట్టినా యన్నమాట—లేవ్వేం?'

'లేచానండి—పదండి, చంపండి, నరకండి—'

'ఎంత కోపం! ఇంకా ఎన్ని పన్లున్నాయో మనకి—అవునుగాని శేషయ్యా...'

'ఏమిటండి మళ్లీ కొత్త ఉపద్రవం...?'

'చిన్న విషయమే—మన సంస్థానంలో—మన వూళ్ళోకూడా ఇలాంటి తాజమహాల్ హోట లొకటి...?'